

కౌన్సిలర్‌కు చినరాజప్ప పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

అనారోగ్యంతో బాధపడుతున్న 22వ వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. ఇటీవల కౌన్సిలర్ అనారోగ్యంతో కాకినాడలో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కౌన్సిలర్‌ను ఆయన బుధవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీశ్ మోహన్, గోలి వెంకట అప్పారావు చౌదరి తదితరులున్నారు.



కౌన్సిలర్‌ను పరామర్శిస్తున్న చినరాజప్ప

కత్తులు దూసిన కోళ్లు

- జోరుగా పందాలు,జూదాలు
- చేతులు మారిన రూ. కోట్లు
- భారీగా ఏర్పాటైన బరులు
- పోలీసులకు భారీగా మామూళ్లు..?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, విలేకరులు

జిల్లా ఉన్నతాధికారులు, పోలీసుల హెచ్చరికలు పని చేయలేదు. పండగ 10 రోజుల ముందు నుంచే మైక్, వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం జరిపి నానా హైరానా పడిన అధికారుల ఆశలపై పందెం రాయుళ్లు నీళ్లు చల్లారు. యథేచ్ఛగా పందేలు, జూదాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సిద్ధం చేసిన సుమారు 700 బరుల్లో పందేలు సాగాయి. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల్లో కోళ్లపై రూ.కోట్ల వ్యాపారం సాగింది. పలు ప్రాంతాల్లో పోలీసులకు పెద్ద మొత్తంలో సొమ్ములు కుమ్మరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. మొత్తంగా ఈ ఏడాది పండగ సీజన్లో దాదాపు రూ.300 కోట్లకు పైగా సొమ్ములు చేతులు మారినట్లు అంచనా.

ఎక్కడికక్కడే పందాలు, గుండాట, పేకాట జూదాలతో పాటు కొన్ని చోట్ల పట్టపగలే అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు సైతం నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో పండగ మూడు రోజులూ మహిళలు కూడా పందేల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిబంధనలను పక్కన పెట్టి మద్యం విక్రయాలు కూడా ఎక్కువ చోట్ల సాగాయి.

భారీ సంఖ్యలో బరులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడిపి, జనసేన నేతలు భారీగా బరులను ఏర్పాటు చేశారు. పోటీ పడి మరీ పార్టీకొక బరి చొప్పున సిద్ధం చేసి పందేలు సాగించారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, యు.కొత్తపల్లి, గొల్లప్రోలు, కాకినాడ రూరల్, సామర్లకోట ప్రాంతాల్లో ఒక్కో చోట రెండేసి బరులు వెలిశాయి. ఇలా ఒక్కో నియోజకవర్గంలో 30 నుంచి 40 బరులను ఏర్పాటు చేశారు. అంబేద్కర్ కోనసీమలో 16 మండలాల్లోనూ భారీ సంఖ్యలో బరులు వెలిశాయి. గతంలో కత్తి పందేలు మాత్రమే జరిగేవి. గతేడాది నుంచి కత్తిపందేలకు తోడు జెట్టీ పందేలు కూడా అధికంగా జరిగాయి.

అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలో సుమారు 30 బరులలో కోడిపందేలు, గుండాటలు జరిగాయి. పలు చోట్ల ప్రజాప్రతినిధులే పందేలను ప్రారంభించడం విశేషం. అమలాపురం నియోజకవర్గం మూడు మండలాల్లో కోడిపందేలు పెద్ద ఎత్తున సాగాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల మూడు రోజుల్లో భారీగా పందేలను నిర్వహించారు. అమలాపురం రూరల్‌లో ఇందుపల్లి, గున్నేపల్లి అగ్రహారం, బండారులంక, సమనస, వన్నెచింతలపూడి, పేరూరు కొంకాపల్లి, తాండవపల్లి, చిందాడగరువు, అల్లవరం మండలం అల్లవరం, గుండెపూడి, కోడూరుపాడు దేశికోడు వంతెన, రెల్లుగడ్డ, ఐ.పోలవరం మండలం కొమరగిరి, ఎదుర్లంక, కేశనకుర్రు, ఐ.పోలవరం, జి.వేమవరంలో మంగళ, బుధ వారాల్లో భారీ స్థాయిలో పందేలు సాగాయి. మండలంలో కేశనకుర్రుపాలెం, ఎదుర్లంక, కొమరగిరిలో భారీ టెంట్లు, ఐరన్ మెష్‌తో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య కోడి పందేలు నిర్వహించారు. అమలాపురం రూరల్ మండలం కామనగరువులో కోడిపందేల బరిలో అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గంలో సుమారు 30 ప్రాంతాల్లో జరిగిన పందేల్లో రోజుకు రూ.3 నుంచి రూ.4 కోట్లు చేతులు మారాయని అంచనా. కాకినాడ రూరల్ అచ్చంపేట, సర్పవరంలో పెద్ద సంఖ్యలో పందేలు సాగాయి. తుని నియోజకవర్గంలో అత్యధికంగా 40కి పైగా బరుల్లో జరిగిన పందేలు, జూదాల ద్వారా అధిక మొత్తంలో సొమ్ములు చేతులు మారాయి. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో పోటాపోటీగా పందేలు సాగాయి. భారీ మొత్తంలో ఇక్కడ సొమ్ములు చేతులు మారడంతో కూటమి నాయకులకు భారీగానే సొమ్ములు వెనకేసుకున్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో తాళ్లపూడి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఫ్లడ్ లైట్ల వెలుగులో కూడా పందేలు కొనసాగాయి. తాళ్లపూడి, పెద్దేవం, మలకపల్లి, రావూరుపాడు, మలకపల్లి, గజ్జరంలో పందేలు నిర్వహించారు.

కడియం మండలం కడియపులంక, దుళ్లలో పందేలు యథేచ్ఛగా సాగాయి.

రాజానగరం మండలం పుణ్యక్షేత్రం, దివాన్‌చెరువు, శ్రీకృష్ణపట్నం, వెలుగుబంద, రాజానగరం, తోకాడ, ముక్కినాడలో పందేలు జోరుగా సాగాయి. శ్రీకృష్ణపట్నంలో పందేలు చూడ్డానికి ఎస్ఇడి స్క్రీన్లు, కుర్చోడానికి సోఫాలు, భారీ సౌండ్ స్పీకర్లు ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలో పందేల్లో విజయం సాధించిన కోళ్ల యజమానులకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, రూ.లక్షా యాభై వేలు బహుమతిగా అందజేశారు.

చాగల్లు మండలం మీనానగరం, ఊనగట్ల, కలవలపల్లి, చిక్కాల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు శివారు పొలాల్లో కోడిపందేలు, గుండాటలు నిర్వహించారు.

సామాన్యుల జేబులు గుల్ల

చివరి రోజు బుధవారం భారీగా పందేలు సాగాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో సామాన్య ప్రజానీకం తమ జేబులను గుల్ల చేసుకున్నారు. ఆయా శిబిరాల వద్ద గుండాట, పేకాటల వద్ద పోటీపడి జూదాల్లో పాల్గొన్నారు.

పోలీసులతో ఒప్పందం

బరుల ఏర్పాటుకు తొలుత అనుమతులు లేవని పోలీసులు హెచ్చరికలు జారీ చేసినా కూటమి నేతల ఒత్తిళ్లతో వెనక్కి తగ్గాల్సి వచ్చింది. పలు చోట్ల పోలీసులతో లోపాయికారీ ఒప్పందం చేసుకున్న పందెం రాయుళ్లు, గుండాట నిర్వాహకులు పెద్ద మొత్తంలో పోలీసులకు ముడుపులు చెల్లించుకొన్నట్లుగా ఆరోపణలు వినిపించాయి. ఒక్కో బరి వద్ద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ ముడుపులు తీసుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.



పిఠాపురంలో జరిగిన పందేల బరిలో పోట్లాడుతున్న కోళ్లు, హాజరైన ప్రజలు

తాళ్లరేవులో బరిలో కత్తులు దూస్తున్న కోళ్లు



కాజులూరు మండలం కొలంకలో భోగి మంటలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న గ్రామస్తులు

ట్రూఅప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు, తాళ్లరేవు

విద్యుత్ వినియోగదారులపై వేసిన ట్రూ అప్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. బుధవారం కాజులూరు మండలం కొలంక, తాళ్లరేవు మండలం జార్జిపేట గ్రామాల్లో పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను పెంచబోమని చెప్పిన నేటి సిఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మాట తప్పారని అన్నారు. సాధారణ విద్యుత్ వినియోగదారుడు నెలకు రూ.300 విద్యుత్‌ను వినియోగించుకుంటే, దానిపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో మరో రూ.200 వసూలు చేయడం దారుణమన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారని, ఈ సమయంలో విద్యుత్ భారాలు వేయడంతో మరింతగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా వేస్తానన్న రూ.20 వేలను తక్షణమే వేయాలని డిమాండ్ చేశారు. కాజులూరు కార్యక్రమంలో నందికోళ్ల సత్తిబాబు, పెద్దిరెడ్డి రాజు, బోడ ఆదినారాయణ, సిరిరెడ్డి కుమార్, తాళ్లరేవు కార్యక్రమంలో రెడ్డి సూరిబాబు, పిల్లి సూరయ్య, పట్టాభి, రెడ్డి బేబీ, పిల్లి మంగాయమ్మ, గుత్తుల సత్యవేణి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడకు పోటెత్తిన పర్యాటకులు

ట్రాఫిక్‌ను మళ్లించిన పోలీసులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ బీచ్‌కు పర్యాటకులు పోటెత్తారు. సంక్రాంతి పండుగలో చివరి రోజు కనుమ పండుగ కావడంతో బీచ్ సందర్శకులతో కిటకిటలాడింది. కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన వారితోపాటు, ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులు రాక బుధవారం ఉదయం నుంచే ప్రారంభం అయింది. సాయంత్రానికి పర్యాటకుల సంఖ్య రెండింతలు చేరడంతో సాయంత్రం పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఉప్పాడ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ మూసి వేశారు. ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే వాహనాలను వయా పిఠాపురం మీదగా దారి మళ్లించారు. అలాగే నేమం జంక్షన్ వద్ద రోడ్డును మూసివేసి, ఉప్పాడ వెళ్లే వాహనాలను నేమం, పండూరు మీదుగా వాహనాలు మళ్లించారు. ఉప్పాడ ప్రాంతాలకు సంబంధించిన ప్రజలు బీచ్‌లో ఉన్న వారిని యథావిధిగా ఉప్పాడ వచ్చేందుకు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు తిమ్మాపురం, యు.కొత్తపల్లి ఎస్‌ఐలతోపాటు, సిబ్బంది ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు. ఒక్కసారిగా ట్రాఫిక్ ఆపివేయడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.



ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న ఎస్ఐ

స్వర్ణాంధ్ర ఆధ్వర్యాన కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - కరప

స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో యండమూరు గ్రామంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కళ్ళజోళ్ళ కోసం గుర్తించిన వారికి బుధవారం ఉదయం అంబేద్కర్ కమ్యూనిటీ భవన ప్రాంగణంలో కళ్ళజోళ్ళు పంపిణీ జరిగింది. కమర్షియల్ టాక్స్ అధికారి సాంబత్తులు వెంకట్రావు, స్వర్ణాంధ్ర నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, గ్రామ సర్పంచ్ మారెళ్ళ శివ చేతులమీదుగా 72 మందికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ పండుగ వేళ పదిమందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు అభినందనీయులని అన్నారు. స్వగ్రామానికి సేవలు అందించడం అందరికీ స్ఫూర్తిని ఇస్తుందన్నారు. స్వర్ణాంధ్ర రాంబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సేవా సంస్థ గత 27 సంవత్సరాలుగా సుమారు 1000కి పైబడి ఉచిత వైద్య సేవ శిబిరాలు నిర్వహించిందని, ప్రతి శిబిరంలోనూ వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు, కంటి ఆపరేషన్లు, తదుపరి కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. వైద్య శిబిరంలో గుర్తించిన సుమారు 18 మందికి ఉచితంగా ఆపరేషన్ చేయించి వారికి అవసరమైన మందులు అందించినట్లు చెప్పారు. స్వగ్రామానికి సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నానని, అవసరం అయితే మరిన్ని సేవలు అందించేందుకు స్వర్ణాంధ్ర తరపున సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెట్ట రాంబాబు, జనపల్లి సాగర్, మారెళ్ళ శ్రీనివాసరావు, గుబ్బల ఏడు కొండలు, బల్ల యేసయ్య, సాంబత్తుల రఘువర్మ, స్వర్ణాంధ్ర సేవా సంస్థ వాలంటీర్స్, పాల్గొన్నారు.



కళ్లజోళ్లు అందజేస్తున్న స్వర్ణాంధ్ర రాంబాబు

విజేతలకు బహుమతుల ప్రదానం

సంక్రాంతి సందర్భంగా వివిధ సంస్థలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు, ఇతర క్రీడా పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, పిఎన్ఎం, పిసిసి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల బహుమతుల ప్రధానోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, 14వ వార్డ్ కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి మాట్లాడారు. అలాగే నువ్వుల గుంట వీధి లో నిర్వహించిన ఆటల పోటీల ముగింపు బహుమతి ప్రధానోత్సవ సభలో 18వ వార్డు కౌన్సిలర్ నీలంశెట్టి అమ్మాజీ పాల్గొని మాట్లాడారు.



పెద్దాపురంలో బహుమతులు అందిస్తున్న ఛైర్‌పర్సన్ తులసి మంగతాయారు

అనంతరం అతిథిల చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సభల్లో భళ్లమూడి సూర్యనారాయణమూర్తి, మండవిల్లి భాస్కరరావు, తమనారి సత్యనారాయణ, టమడపు బాబురావు, ముర్రి వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, రొంగల సుబ్బలక్ష్మి, షేక్ నాగూర్, డి.సత్యనారాయణ, కె.అరుణ, గరగపాటి పెంటయ్య పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** రూరల్ మండలం చీడిగ గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి 3 రోజులు ముగ్గులు పోటీలతో పాటు, ఇతర ఆటలు, పాటలు, నృత్యాల పోటీలు జరిగాయి. వీటిలో పాల్గొన్న వారందరికీ బహుమతులతో పాటు గెలిచిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. స్థానిక వాటర్ ట్యాంక్ సెంటర్లో జరిగిన బహిరంగ సభలో వర్తమాన సినీ నటుడు వి.సాగర్, డాన్స్ మాస్టర్ వి.రాజు, ఆర్ట్ డైరెక్టర్ పి.రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగర్ హీరోగా నటించిన రోమాన్టిక్ లైఫ్ సినిమాలోని రెండు గేయాలు విడుదల చేశారు. డివైఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి పెద్దింశెట్టి రామకృష్ణ, ప్రజా నాట్యమండలి నాయకులు జుత్తుగ శ్రీనివాసరావు, జెవివి నాయకులు యుఎస్ఎన్.రెడ్డి మాట్లాడారు. కళాకారుల సంఘం నాయకులు అనపర్తి ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సభలో మురళి, చింతాకుల రాజు డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి లోవరాజు, డివైఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, సాయి నిఖిల్, సాయి వెంకట్, డి.శ్రీనివాస్, వినయ్, విజయ్, సతీష్, పార్థు, కోటేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు. **సామర్లకోట** విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యునిటి హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సినీ దర్శకులు కెబి.ఆనంద్, హైకోర్టు న్యాయవాది వనమోజు సత్యరవికుమార్, తదితరులు విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమాసుందరి, కర్రి సత్యవెంకటేష్, విజరపు ప్రకాశరావు పాల్గొన్నారు. అలాగే 23వ వార్డులో వైసిపి నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు సేపేని శ్రీరూప, కౌన్సిలర్ సేపేని సురేష్‌ల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి ఐశ్వర్య మహిళా కళాశాల కరెస్పాండెంట్ కరణం శ్రీనివాస్, కర్రి బాబురావు, బావిశెట్టి భద్రరావు, మార్తాల సంజు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. **తొండంగి** మండలంలోని గడ్డిపేట గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎంఎల్ఎ యనమల దివ్య బహుమతులు అందజేశారు. టిడిపి అధ్యక్షుడు చొక్కా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోరాజేష్, సిహెచ్ కాశీ విశ్వేశ్వరరావు, వెంకటరమణ, కేశవ్, మహంకాళి, రాజబాబు, రాంబాబు, ఎ.నరసింహమూర్తి, కె.మల్లేష్, పి.శ్రీను పాల్గొన్నారు.



తొండంగిలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఎల్ఎ దివ్య

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని ధర్మవరం పంచాయతీ కార్మికులకు ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయంటే అందుకు పారిశుధ్య కార్మికులే కారణమన్నారు. అటువంటి కార్మికులకు జీతాలను పెంచి ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, నానిపల్లి చంటి, పోకనాటి శేషగిరి, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు పాల్గొన్నారు.



కార్మికులతో మురళీకృష్ణంరాజు

వృద్ధులకు దుస్తులు, పండ్లు అందజేత

ప్రజాశక్తి - కాజులూరు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అయితపూడి గ్రామంలో కొల్లు వెంకన్న ఫౌండేషన్ అధ్యక్షులు కొల్లు వెంకటేశ్వరరావు ఇంటి వద్ద వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంట సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. ప్రతి ఏడాది వృద్ధులకు దుస్తులు, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వరలక్ష్మి, వెంకటసత్యరవితేజ, శృతి, వెంకటచైతన్యకృష్ణ, మణికుమారి, పంపన వెంకటేశ్వరరావు, సూరిశెట్టి రామస్వామి, మండలంలోని అయితపూడి, తిప్పరాజుపాలెం, తనుమల్ల, దుగుదురు గ్రామాలకు చెందిన వృద్ధులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు


క్లాప్స్ నూతన కమిటీ అధ్యక్షునిగా సత్యానందం

ప్రజాశక్తి - పెద్దాపురం

క్లాప్స్ నూతన కమిటీ అధ్యక్షులుగా జి.సత్యానందం నియమితులయ్యారు. స్థానిక కల్వరి మిరాకిల్ చర్చిలో క్లాప్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ లంక పురుషోత్తమ దాస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ నియామకం జరిగింది. కన్వీనర్‌గా డాక్టర్ సిబిఐ.సుకుమార్, ఉపాధ్యక్షులుగా జ్ఞానానందం, సెక్రటరీగా కె.జిమ్స్‌శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ డిఎస్‌పి.రావు, కోశాధికారిగా ఎన్.సుకుమార్‌సహాయం, సభ్యులుగా జి.విక్టర్‌ప్రేమ్‌సాగర్, టి.నవీన్‌రాజ్, ఎన్.సామ్యూల్, సలహాదారులుగా డాక్టర్ డిపిడికె.జార్జిమేషన్, డాక్టర్ ఎన్.భాస్కరరావు, సిహెచ్.జ్యోతిబాబు, జి.రాజారావు, డాక్టర్ ఇ.విలియంప్రసాద్, న్యాయ సలహాదారులుగా తలారి విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ జిఆర్.ఇమ్మానుయేల్‌రాజ్‌ను ఘనంగా సన్మానించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం



జోరుగా కోడి పందేలు
ప్రేక్షకపాత్రలో అధికారులు

పాఠశాల ఆవరణలో పందేలు

ప్రజాశక్తి - తుని

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కోడిపందాలు, పేకాట, గుండాట నిర్వహించారు. తుని రూరల్ మండలం వెలమకొత్తూరు గ్రామ పాఠశాలలో సంక్రాంతికి ముందు జూదాలు వద్దు...సంప్రదాయ క్రీడలు ముద్దు అని పోలీసులు క్రీడా పోటీలు నిర్వహించారు. అదే ఆవరణలో సంక్రాంతి రోజున కోడిపందాలు నిర్వహించడం సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం అంతా తుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో జరుగుతున్నప్పటికీ పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. అలాగే ఉప్పరగూడెంలో నిర్వహించిన కోడి పందేల వద్ద ఇరు గ్రూపుల మధ్య మాట మాట పెరిగి కొట్లాటకు దారితీయడంతో పోలీసుల లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు. ఆ గ్రామంలో రాత్రంతా పోలీస్ పికిటింగ్ ఏర్పాటు చేశారు. తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందేలు, గుండాట, పేకాట వంటి జూదక్రీడలు యథేచ్ఛగా కొనసాగాయి.



స్కూల్ ఆవరణలో కోడిపందేలు



పాఠశాల ఆవరణలో జరుగుతున్న గుండాట



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

పూడిక తీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక మఠం సెంటర్లో జరుగుతున్న మేజర్ డ్రెయినేజీలో చేపట్టిన పూడికతీత పనులను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పార్టీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఏళ్ళు తరబడి పేరుకుపోయిన పూడికను జెసిబి తొలగిస్తుండగా పనులను పరిశీలించి స్థానిక పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు. పూర్తిస్థాయిలో మేజర్ డ్రెయిన్‌లలో పూడికలు తొలగించి వర్షాకాలంలో జలాల ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గౌడా డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, భీమేశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీశ్‌మోహన్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి వెంకటఅప్పారావుచౌదరి పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత నడకుదురు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

గత మూడు రోజులుగా స్థానికంగా జరిగిన డే అండ్ నైట్ నాకౌట్ వాలీబాల్ టోర్నీలో కరప మండలం నడకుదురు జట్టు విన్నర్‌గా నిలిచింది. ఐ, పోలవరం మండలం భైరవ-పాలెం జట్టు రన్నర్‌గా, మూడు నాలుగు స్థానాలను యానాం గిరియంపేట జట్లు నిలిచాయి. గెలుపొందిన జట్లకు యానం హోండా షోరూం అధినేత తోట రాజు, ముమ్మిడివరం ఎఎంసి మాజీ ఛైర్మన్ శివన్నారాయణ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు, నాయకులు బొంతు శ్రీనివాస్, ఎంఎస్ఆర్, బర్రె లక్ష్మీనరసింహరాజు, వివేకానంద హైస్కూల్ ప్రిన్సిపల్ శంకర్, కుడుపూడి మల్లేష్, కె.ఆనంద్, పి.శ్రీనివాస్, పిడి గుత్తుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



విన్నర్ జట్టుకు కప్‌ను అందిస్తున్న తోట రాజు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మోటార్ బైక్‌తో స్తంభాన్ని ఢీ కొట్టిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక శివాలయం వీధికి చెందిన బిక్కివిల్లి వీరబ్బాయి (26) లింగంపర్తి రోడ్‌లో స్పోర్ట్స్ బైక్‌పై వేగంగా వెళుతూ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఏలేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుండాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

అక్రమంగా నిర్వహిస్తున్న గుండాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. మండలంలోని కొడవలి గ్రామం శివారులో బుధవారం నిర్వహిస్తున్న గుండాట శిబిరంపై సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1030 నగదును స్వాధీనం చేసుకున్నారు.

కాలువలోకి బైకు దూసుకుపోయి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిధిలోని జి.వేమవరం పంచాయతీలో ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయాడు. ఈ ఘటనలో గండి వీరభద్రరావు(45) అనే వ్యక్తి మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన వీరభద్రరావు జి.వేమవరంలోని రొయ్యల చెరువుల వద్ద పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో చెరువుల వద్ద నుంచి ఇంటికి బైక్ పై వెళుతుండగా స్థానిక ఆశ్రమం వద్ద బైక్ అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో వీరభద్రరావు మట్టిలో కూరుకుపోయి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏడుగురిపై కేసుల నమోదు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో నిర్వహించిన కోడి పందేల బరులపై దాడి చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 100 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

14 మంది అరెస్టు నగదు, కత్తులు స్వాధీనం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండల పరిధిలో కోడిపందేలు, జూదం ఆడుతున్న వారిపై ఉండ్రాజవరం ఎస్ఐ జి.శ్రీనివాసరావు, బుధవారం సిబ్బందితో కలిసి దాడులు చేశారు. 5 కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో 14 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,0550 నగదు, 4 కత్తులు, 4 కోళ్ల సీజ్ చేసినట్లు చెప్పారు.

20, 21, 22 తేదీల్లో ఉరుస్ గంధోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం



విద్యుత్ అలంకరణ మధ్య బాబా సమాధి

పాత పెద్దాపురంలో 9 మూరల నవాబుగా, ముస్లింలకు నౌగజ్ బాబాగా ప్రసిద్ధి చెందిన హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా, షా రహమతుల్లా వార్ల గంధోత్సవం ఈనెల 20, 21, 22 తేదీలలో ఘనంగా నిర్వహించబడుతుందని దర్గా కమిటీ అధ్యక్షులు ఎండి లాయక్‌అలీ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనవరి 20వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు ముస్లిం అంజుమన్ వ్యవస్థాపకుడు ఎంఎ సత్తార్ ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపుగా బయలుదేరి దర్గాకు చేరుకుంటుందన్నారు. రాత్రి 7 గంటలకు హైదరాబాదు వారిచే ప్రత్యేకంగా తయారుచేసిన పచ్చటి వస్త్రాన్ని బాబాకి అలంకరించి ఖురాన్ పఠనంతో గంధాన్ని బాబా సమాధికి పూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ ఛైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, ఆదిత్య యూనివర్సిటీ ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి సందడి

ప్రజాశక్తి - రౌతులపూడి



విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ సీత

గత మూడు రోజులుగా మండలంలో సంక్రాంతి సందడి నెలకొంది. మండలంలోని ఎస్ఎస్ పట్నం గ్రామంలో మేము సైతం సేవా సంస్థ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే బలరామపురంలో చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ దాసరి తాతాజీ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విన్నర్ జట్టుకు రూ.3 వేలు, రన్నర్స్ జట్లుకు రూ.2 వేలు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైల సీత, మాజీ సర్పంచ్ పైలా పైడ్రాజు, స్థానిక నాయకులు కాకి సీతారామస్వామి పాల్గొన్నారు. అలాగే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఇతర క్రీడలు నిర్వహించారు.

సంక్రాంతి సంబరాల్లో క్రికెటర్ భరత్

ప్రజాశక్తి - గండేపల్లి



భరత్‌ను సత్కరిస్తున్న పరిమి బాబు

మండలంలోని ఎన్‌టి రాజాపురం గ్రామంలో టిడిపి నాయకులు పరిమి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో క్రికెటర్ కెఎస్.భరత్ పాల్గొన్నారు. ఆయనతోపాటు, సినిమా యాక్టర్ జ్యోతి, ఇతర ప్రముఖులు రావడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు పరిమి బాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మూడు రోజులపాటు జరిగిన సంక్రాంతి వేడుకల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంపై పరిమి బాబు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - కరప



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న వెంకటరమణ

మండలంలోని నడకుదురు గ్రామంలో ఉన్న జనావళి వృద్ధాశ్రమంలో బుధవారం యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తనకు వచ్చిన జీతంలో కొంతమేర పేదల కోసం కేటాయించి సేవ చేస్తున్నట్లు తెలిపారు. తన సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ కొనసాగిస్తానని అన్నారు. నిరుపేదలను ఆదుకునేందుకు యువత ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, వీరభద్రరావు, రమేష్ పాల్గొన్నారు.

యానాం వార్తలు



క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ శ్రీనివాస్

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - యానాం

మహారాష్ట్రలో భారత బాల్ బాడ్మింటన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 21 వరకు నిర్వహించే 69వ జాతీయస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు యానాం క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ బొట్టా శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పుదుచ్చేరి జట్టు తరుపున చోడే గుణశ్యామ్‌ప్రతాప్, రుద్రరాజు షణ్ముఖ వెంకట వర్మరాజు, సబ్బతి విష్ణు శ్రీవర్ధన్, పాలెపు యోమంత్ గంగాధర్ భరత్, పోలిశెట్టి హర్షిని దేవి, కుసుమ షర్మిల ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సీనియర్ క్రీడాకారులు రాయపురెడ్డి విజయ్, క్లబ్ సభ్యులు అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

'బరిలో' నవల ఆవిష్కరణ

ప్రజాశక్తి - యానాం

యానాంకు చెందిన ప్రముఖకవి, కథకుడు దాట్ల దేవదానం రాజు రచించిన "బరిలో" అనే నవలను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు బుధవారం ఆవిష్కరించారు. మురమళ్లలో జరిగిన కోడిపందేల బరిలోనే ఈ నవలను ఆవిష్కరించారు. కోడిపందేల ఇతివృత్తంతో రాసిన 'బరిలో' నవలను కోడిపందేల బరిలోనే ఆవిష్కరించడం విశేషం. కోడిపందేలపై ప్రత్యేకంగా ఒక నవల తెలుగు సాహిత్యంలో నమోదు కాలేదని, విషయ సేకరణ చేసి రాసిన నవల అని రచయిత దాట్ల దేవదానంరాజు తెలిపారు.


సంక్రాంతి వేడుకల్లో గ్రామదేవతల జాతరలు

ప్రజాశక్తి - యంత్రాంగం



పెద్దాపురంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామ దేవతల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శంఖవరం కనుమ పండుగ సందర్భంగా అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారికి ప్రభల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం కొండ దిగున చిన్న రావిచెట్టు వీధిలో రామాలయం వద్ద దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు సమక్షంలో స్వామి అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు, ఆలయ అధికారులు కొండలరావు, జగ్గారావు, సతీష్ పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక జగ్గంపేట రహదారి పాండవుల మెట్ట వద్ద ఉన్న సత్తెమ్మ అమ్మవారి 51వ జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఆశాధులు పప్పల సత్తిబాబు, పెద్ద సత్తిబాబు ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ ఉత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన జానపద కళారూపాలు, సాము గరిడీలు, గరగల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, నాయకులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు, రంది సత్యనారాయణ, తూతిక రాజు, యాళ్ల వీరబాబు, శ్రీకాంత్, బిక్కిన సాయి, చలపతిరావు, మహారాణి సత్రం మాజీ ఛైర్మన్ కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావ్, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్ ఆరేళ్ల వీరరాఘవ పాల్గొన్నారు. **సామర్లకోట** సంక్రాంతి వేడుకల్లో భాగంగా స్థానిక కావమ్మ పేరంటాలి తీర్థ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కనుమ పండుగను ప్రజలు, రైతులు పశువుల పండుగగా జరుపుకున్నారు. రైతులు ఉదయమే వారి ఎద్దులు, పాడి పశువులతో పాటు వ్యవసాయ సంబంధమైన సామాగ్రిని శుభ్రం చేసుకుని వాటికి పూజలు జరిపి పశువులను అలంకరించి ఆనందంగా గడిపారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ నాయకులు సుకపట్ల నాగేశ్వరావు, సుకపట్ల బాబ్జి, మాజీ కౌన్సిలర్ మడగల రమణ, సుకపట్ల సతీష్, కిమ్మిడి ఆదిబాబు, వడ్డాది సోమేష్, తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** జగ్గంపేట గ్రామ దేవత రావులమ్మ అమ్మవారి జాతరను బుధవారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా కనుమ పండుగ రోజున ఈ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా అమ్మవారిని స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. నెహ్రూకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ జాతరలో శక్తి వేషాలు, గరగ నృత్యాలు, తీన్మార్, డీజే లు ఏర్పాటు చేశారు.



సామర్లకోటలో పూజలు చేస్తున్న భక్తులు



జగ్గంపేటలో శక్తి వేషాలతో కళాకారులు

మాజీ ఎంఎల్ఎ బొడ్డు జయంతి

ప్రజాశక్తి - పెద్దాపురం



బొడ్డు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

మాజీ ఎంఎల్ఎ బొడ్డు భాస్కరరామారావు 75వ జయంతిని బుధవారం కాండ్రకోట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంఎల్ఎగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గవరసాన రాజశేఖర్, ఊటా నాగబాబు, పంచాది రామకృష్ణ, బచ్చు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

17న వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ శాఖ దాడుల్లో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలను ఈనెల 17న స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనేవారు ధరావత్తు సొమ్ము జమ చేసి, ఆధార్, పాన్ కార్డ్ నకళ్ళు అందజేయాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు జిఎస్‌టి సొమ్ము కూడా చెల్లించవలసి ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం 80742 17578, 83675 90908 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ వలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

మండలంలోని అంగర మెయిన్ రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది . ఆ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రహదారి పక్కనే ఉన్న ఈ ట్రాన్స్ ఫార్మర్ చేతికి అందే విధంగా ప్రమాదభరితంగా ఉందని, ఈ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, గ్రామస్తులు ప్రయాణికులు భయాందోళనలు చెందుతున్నారు. ప్రతినిత్యం రద్దీగా ఉండే రహదారి లో ప్రయాణికులు వాహనదారులు ఈ మార్గం ద్వారానే వెళ్లవలసి ఉంది. వర్షాలు కురిసే సమయాల్లో ట్రాన్స్ ఫార్మర్ వద్ద ప్రమాద భరితంగా ఉందని సంబంధిత ట్రాన్స్ కో అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్ ఫార్మర్ కు రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు . ఆ ప్రాంతానికి ఎవరు వెళ్లినా విద్యుత్ ఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యగా ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాగుల చెరువుకు బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని నాగుల చెరువు గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్ వాసంశెట్టి సత్యనారాయణ అధికారులు కోరారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నాగుల చెరువు గ్రామానికి రహదారి సౌకర్యం ఉన్నప్పటికి శివారు ప్రాంతం కావడంతో ఆర్‌టిసి అధికారులు ఇప్పటి వరకు బస్సు సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగుల చెరువు గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు చదువుల నిమిత్తంవెళ్లే విద్యార్థులు, ప్రయాణికులకు బస్సు సౌకర్యం లేక పలు అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో ఇదే సమస్యను అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికి ఫలితం లేకపోయిందన్నారు.

గోతులమయంగా ఏటిగట్టు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రం కపిలేశ్వరపురం నుంచి జొన్నాడ వెళ్లాలంటే ఏటిగట్టు రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఈ ఏటిగట్టు రహదారి పై ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఏటిగట్టు రహదారి కావడం వల్ల, ఆదమరిస్తే ఒకపక్క గోదావరి, ఇటు కాలవ, అటు గుంతలు ,ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటున్నాయని ప్రజల వాపోతున్నారు. ఈ రోడ్డు మీదిగా రావులపాలెం, జొన్నాడ, యానాం, కోటిపల్లి, తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రతి నిత్యం ఈ రహదారి మీదు గా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సిద్ధమైన జొన్నాడ-మండపేట రహదారి

రూ.కోటీ 30 లక్షలతో పూర్తయిన మరమ్మతులు

ప్రజాశక్తి - ఆలమూరు



జొన్నాడ వద్ద ఆర్ అండ్ బి రహదారి

మండలంలోని జొన్నాడ నుంచి మండపేట వరకు అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బి రోడ్డును రూ.కోటి 30 లక్షలతో మరమ్మతులు పూర్తయ్యాయి. గత కొంతకాలంగా ఈ రోడ్డు పెద్ద గోతులతో ఛిద్రంగా మారి ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండేది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ప్రయాణం ఒక సాహసంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతులకు హామీ ఇచ్చింది. కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ రోడ్డు పనులను చేపట్టారు. జొన్నాడ నుంచి గుమ్మిలేరు వరకు రూ. 70 లక్షలతో మరమ్మతులు పూర్తి చేయగా అక్కడ నుంచి మండపేట వరకు రూ.60 లక్షలతో ఈ పనులు పూర్తి కావచ్చాయి. మొత్తం ఈరోడ్డు పనులు పూర్తి స్థాయిలో జరిగి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ఈ రోడ్డుపై ప్రస్తుతం ప్రయాణిస్తున్న వాహన దారులు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బోడిపాలెం వంతెన

శిథిలావస్థలో బోడిపాలెం వంతెన

వంతెనపై భారీ వాహనాల నిలుపుదల చేయాలని కోరుతున్న లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలం లంక గ్రామాల సమీపంలోఉన్న బోడిపాలెం వంతెన శిథిలావస్థకు చేరుకుంది. బోడిపాలెం వంతెన శిథిలావస్థలో వుందని తెలిసినా ప్రతి నిత్యం వందలాది లారీలు మట్టి లోడ్ తో ఇటుక బట్టిలకు వెళుతూ వుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన గతకాలం నుంచి పాలకులు, అధికారులు శిథిలావస్థలో ఉన్న వంతెన పునర్నిర్మిస్తామని అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సంబంధిత అధికారులు ఇంతవరకు వంతెన నిర్మాణ పనులు చేపట్టలేదు. కేదార్‌లంక, వీధి వారి లంక, నారాయణ లంక గ్రామస్తులు ప్రతి నిత్యం ఏ చిన్న పని కైనా కొత్తపేట, రావులపాలెం, అమలాపురం వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ వంతెనే ఆధారం. ఈ వంతెన కాస్తా కూలి పోతే తమ పరిస్థితి ఏంటని లంక గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల పై అతి వేగం తో భారీ వాహనాలు వెళ్ళడం వల్ల వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తాతపూడి పంపింగ్ స్కీముకు రక్షణ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం



తాతపూడి పంపింగ్ స్కీమ్‌కు రక్షణ గోడ లేక ఏర్పాటుచేసిన కర్రలు, బరకం

మండలంలోని తాతపూడి సమీపంలో గోదావరి ఏటి గట్టు పై ఉన్న పంపింగ్ స్కీమ్ భవనానికి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు .గతంలో ఈ గోడ తుపాను ఉధృతికి నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో రక్షణ గోడ కరువయ్యింది. నీటి ఎద్దడి సమయాల్లోనే ఈ పంపింగ్ స్కీమ్ నుంచి గోదావరి నది నుంచి సాగునీరు కు వినియోగిస్తారు. అధికారులు మిగిలిన రోజుల్లో ఈ భవనం వైపు కన్నెత్తి కూడా చూడరు. రక్షణ గోడ లేని ప్రాంతంలో కర్రలతో ఏర్పాటు చేశారు. గతంలో ఈ పంపింగ్ స్కీమ్‌లో ఉన్న సామగ్రి చోరీ జరిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. భవనంలో విలువైన మోటార్లు, సామగ్రి, ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో రక్షణ తాతపూడి పంపింగ్ స్కీమ్‌కు గోడ నిర్మించాలని ప్రజలు, స్థానికులు, సంబంధిత అధికారులను కోరుతున్నారు.

అమ్మవారికి వెండి పాదుకల బహూకరణ

ప్రజాశక్తి -మామిడికుదురు



పద్మావతి అమ్మవారికి వెండి పాదుకలు అందజేస్తున్న దాత దంపతులు

మండలంలోనిఅప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి సన్నిధిలో పద్మావతి దేవి అమ్మవారికిఅదే గ్రామానికి చెందిన తతవత్తి మోహన్ వాణి దంపతులు ఈ నెల 14న వెండి పాదుకలు బహూకరించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. రూ.52వేలు విలువైన వెండి పాదుకులను ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు దాత దంపతులు అందజేశారు. వాటికి సంప్రోక్షణ నిర్వహించి దాత దంపతులచే ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలమ అర్చకులు స్వామివారి ఆశీర్వచనం అందజేశారు.

డీసీసీబి బ్యాంక్ మేనేజర్ జగ్గంపేట వారి ప్రకటన

కాకినాడ జిల్లా, జగ్గంపేట మండలం, గుర్రపాలెం గ్రామస్తులు అయిన పడాల గంగారత్నం, సూర్యనారాయణ లకు సంబంధించిన సర్వే నెంబర్ 378/1 కి చెందిన 17.60 సెంట్లు సంబంధించిన దస్తావేజు పోవడం జరిగింది. జగ్గంపేట నుండి బండిపై ప్రయాణించే సమయంలో జారిపోయి పడిపోయినవి. **దస్తావేజు నెంబర్ 2309/1983.** ఎవరికైనా దొరికినచో ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 97048 15482

దస్తావేజు పోయినది

నాపేరు గోళ్ళ నాగేశ్వరరావు తండ్రి వీరభద్రం(లేటు) అను నాకు ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి గ్రామంలో 25 సెంట్లు వ్యవసాయభూమి కలదు. సదరు భూమికి చెందిన లింకు దస్తావేజు **నెం.116/1A** మరియు **2206/2009**లు. **ది.20-12-2024**వ తేదీన నా ద్విచక్ర వాహనంపై కవరు లో పెట్టుకుని ఏలేశ్వరం బ్యాంక్ పని మీద వెళ్లగా సదరు కవర్లో రెండు దస్తావేజులు పాస్ బుక్‌లు మాత్రమే ఉన్నవి. శ్రీ పిడుగు అగ్రహారం తండ్రి అప్పారావు అను వారి నుండి కొనుగోలు చేసిన దస్తావేజు తాలూకు లింకు దస్తావేజు పోయినది. చుట్టుపక్కల ఎంత వెతికినా దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేగలరు.

గోళ్ళ నాగేశ్వరరావు
తండ్రి వీరభద్రం(లేటు), చినశంకర్లపూడి గ్రామం,
ప్రత్తిపాడు మండలం,సెల్:9441793174